వినియోగంలోకి వచ్చేదెన్నడో?

- హుస్నాబాద్‌లో దాదాపు 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన గ్రంథాలయం
- శిథిలావస్థకు చేరడంతో నూతన భవనానికి ఏడేళ్ల క్రితమే శంకుస్థాపన

8

ఊబిలో నుంచి
ఉత్తమస్థాయికి..

- ఐదేళ్ల క్రితం రూ. 12 లక్షల నష్టాల్లో డీసీఎంఎస్
- ఇప్పుడు ప్రతీఏటా రూ. 25కోట్లకు పైగానే టర్నోవర్
- రూ. 100 కోట్ల విలువైన ఆస్తులను సంరక్షించాం
- రైతుసేవా కేంద్రాలతో బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాము
- 3.10 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- టీంవర్క్‌తోనే రాష్ట్రంలో నంబర్‌వన్ స్థానానికి..
- డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్



డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 12: నష్టాల ఊబిలో నుంచి తెలంగాణలో నంబర్‌వన్ స్థానానికి చేరడం వెనుక టీంవర్క్ దోహదం చేసిందని డీసీఎంఎస్ (జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ)చైర్మన్ మల్కాపురం శివకుమార్ అన్నారు. ఈ నెల 28తో డీసీఎంఎస్ పాలకవర్గం గడువు ముగుస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా విస్తరించిన ఈ సొసైటీని ఐదేళ్లలోనే అగ్రస్థాయిలో నిలబెట్టామనే సంతృప్తి మరువలేనిదని ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. డైరెక్టర్లు, సొసైటీల చైర్మన్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు, అధికారులు, సేవాకేంద్రాల నిర్వాహకుల కృషి ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

లాభాల బాట పట్టడానికి ఎలా ముందుకెళ్లారు?

2020 ఫిబ్రవరి 29న బాధ్యతలు చేపట్టిన సమయంలో సొంతంగా మాకు కార్యాలయం కూడా లేదు. జిల్లా సొసైటీ అప్పటికే రూ.12లక్షల నష్టాల్లో ఉంది. ముందుకు తీసుకెళ్లడానికి అనేక ఆలోచనలు చేశాం. డీసీఎంఎస్ సంస్థపై రైతుల్లో విశ్వసనీయత, నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టాం. రైతుసేవా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాం. 50 కేంద్రాల ద్వారా దాన్యం, మక్కలు, సోయా, కందులు కొనుగోలు చేశాం.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డీసీఎంఎస్‌ను రైతులు విశ్వసిస్తున్నారా?

నేను బాధ్యతలు చేపట్టాక మొదటి ఏడాదిలోనే రూ.23లక్షల లాభం రాగా ప్రస్తుతం రూ.కోటికి చేరువైంది. 2020-21లో ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,228 మంది రైతులకు విత్తనాలు, ఎరువులు అందించగా.. ఐదేళ్లలో ఆ సంఖ్య 1.29 లక్షలకు చేరిందంటే రైతులకు నమ్మకం కలిగించడంతోనే సాధ్యమైంది. ఐదేళ్ల వ్యవధిలో 2.88 లక్షల మంది రైతులకు దశలవారీగా విత్తనాలు, ఎరువులను రైతు సేవాకేంద్రాల ద్వారా తక్కువ ధరకు విక్రయించడం జరిగింది. 37,415 మంది రైతుల వద్ద 18లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలు చేశాం. ఇంతకన్నా సక్సెస్ ఏముంటుంది.

ఆదాయాన్ని ఎలా వినియోగిస్తున్నారు?

ఐదేళ్ల వ్యవధిలో దాదాపు రూ.10 కోట్ల వరకు డీసీఎంఎస్‌కు ఆదాయం సమకూరేలా కృషిచేశాం. ప్రతీఏటా విత్తనాలు, ఎరువులు, ఇతర క్రయవిక్రయాల ద్వారా రూ.20కోట్లకు పైగానే టర్నోవర్ జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారు రూ.100 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిరక్షించాం. జహీరాబాద్‌లో ఫార్మర్ సర్వీస్ సెంటర్‌ను నిర్మిస్తున్నాం. డీసీఎంఎస్ స్థలంలో భారీ కాంప్లెక్స్‌ను నిర్మించి అద్దెల ద్వారా శాశ్వత ఆదాయాన్ని సమకూర్చుతున్నాం. ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా పారదర్శకంగా లావాదేవీలు కొనసాగాయి.

అనుభవం లేకున్నా ఐదేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగడంపై?

నేను సినిమా, వ్యాపార రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చాను. మొదటిసారి డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాను. 'సీ' గ్రేడ్‌లో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాను 'ఏ' గ్రేడ్‌కు చేర్చి తెలంగాణలోనే తొలి స్థానాన్ని దక్కించుకున్నాం. కొన్ని మార్కెటింగ్ స్కిల్స్‌ను వినియోగించడంతోపాటు బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి రైతులకు మేలుచేశాననే తృప్తిగా ఉంది. అప్పుడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు సహకారం నన్ను మరింత ముందుకు నడిపించింది. అనుభవం కంటే ఆలోచనా విధానం, రైతులకు సేవచేయాలనే పట్టుదల ఉన్నందునే ఐదేళ్లపాటు ఆదర్శంగా తీర్చిదిద్దాను.

ఆయిల్‌పాం సాగుకు
వెనుకంజ

- అవగాహన కల్పించని అధికారులు
- సరైన సలహాలు, సూచనలు అందక రైతుల అవస్థలు
- పలుచోట్ల మొక్కలను తొలగిస్తున్నవైనం
- ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి



ఆయిల్ పాం తోటలు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పంటను సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని నాలుగేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం, అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, పుల్లూరు, నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు గోపులాపూర్‌లో రైతులు అధిక మొత్తంలో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. రైతులకు అందుబాటులో మార్కెటింగ్ సదుపాయం ఉండాలనే లక్ష్యంతో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నంగునూరు మండలం నర్మెట్ట వద్ద ఆయిల్ ఫెడ్ కంపెనీ స్థాపించేందుకు పనులు ప్రారంభించారు. హరీశ్‌రావు పిలుపు మేరకు రైతులు ముందుకొచ్చి అవగాహన సదస్సుల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటారు. ప్రారంభంలో వ్యవసాయ, ఆయిల్‌ఫెడ్ అధికారులు రైతులు అవగహన కల్పించి మొక్కలు నాటించారు. ప్రారంభంలో ఆర్భాటం చేసిన అధికారులు ఆ తర్వాత రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎంతకూ అధికారుల నుంచి సలహాలు, సూచనలు అందకపోవడంతో విసుగుచెందిన రైతులు ఆయిల్‌పాం మొక్కలను తొలగిస్తున్నారు. అధికారులు అసలు తోటల వైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. క్రమంగా రైతుల్లో ఈ పంటపై ఆసక్తి తగ్గిపోతుంది. కొత్తగా సాగుచేసేందుకు కూడా రైతులు ముందుకు రావడం లేదు. సిద్దిపేటరూరల్ మండలంలో 506 ఎకరాల్లో, నారాయణరావుపేట మండలంలో 513 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశారు. ఇప్పటివరకు రెండు మండలాల్లో 1016 ఎకరాల్లోనే మొక్కలు నాటారు. ఆయిల్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ అధికారులను అనుసంధానం చేయడంతో భారం మొత్తం వీరిపైనే పడడం వల్ల కొంతమేరకు లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమే. ఆయిల్ పాం సాగు చేసే రైతులకు ఏడాదికి ఎకరానికి రూ. 4,200 చొప్పున నాలుగేళ్లపాటు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తారు. డ్రిప్ సదుపాయం కోసం రాయితీపై పరికరాలను అందిస్తారు. అయినా కూడా ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు రావ డం లేదు. అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినా కూడా ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

దిగుబడికి నాలుగేళ్లు వేచి ఉండలేక..

సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట మండలాల్లో ఎక్కువగా వరి సాగవుతుంది. ఈ పంట నాలుగు నెలల్లోనే చేతికి వస్తుంది. ఆయిల్‌పాం దీర్ఘకాలిక పంట. నాలుగేళ్ల తర్వాత కొద్దికొద్దిగా దిగుబడులు ప్రారంభమవుతాయి. పెట్టుబడి పెట్టి అంత కాలం ఎదురుచూసే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావడం లేదు. గతంలో వేసిన ఆయిల్‌పాం పంట దిగుబడులు వచ్చే ఏడాది నుంచి అందనున్నాయి. ఈ దిగుబడులను చూసి రైతులకు పూర్తిస్థాయి అవగాహన కలుగుతుందని, ఫలితంగా సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ముందున్నంత ఉత్సాహంతో ఆయిల్‌ఫెడ్ అధికారులు స్పందించపోవడం, నెలల తరబడి తోటలను పరిశీలించకపోవడంతో రైతులకు సూచనలు చేయకపోవడంతో వాటిని తొలగించి సాధారణ పంటలను సాగు చేస్తున్నారు. నాడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనలతో ఆదర్శంగా నిలిచిన గ్రామాల్లో కొందరు రైతులు.. అధికారులు స్పందించకపోవడం వల్ల కొన్ని ఎకరాల్లో తోటలను తొలగించారు.



ఆయిల్‌పాంలో అంతర పంటగా వరి నాటు వేసేందుకు దుక్కు సిద్ధం చేసిన రైతు

కానరాని ఆయిల్‌ఫెడ్ అధికారులు



మాకున్న మూడున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటాం. మొదట్లో అంతాబాగానే ఉన్నా కొన్ని నెలలుగా ఆయిల్‌ఫెడ్ అధికారులు తోటలు సందర్శించిన దాఖలాలు లేవు. అధికారుల సూచనలు లేకపోవడంతో కొందరు మొక్కలు తొలగించి వరి, ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఆయిల్‌ఫెడ్ అధికారులు ఆయిల్ ఫెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో తోటలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలి

– ఒగ్గు మరళీ, రైతు, పుల్లూరు, సిద్దిపేటరూరల్ మండలం

ఫోన్లు చేసినా స్పందించరు



ఆయిల్‌పాం సాగు చేయాలని, అధిక దిగుబడి, లాభాలు ఉంటాయని ప్రారంభంలో అవగహన కల్పించిన అధికారులు ఇప్పుడు ఫోన్లు చేసినా స్పందించడం లేదు. మందులు ఎలా వాడాలి. ఏ సమయంలో ఎలాంటి ఎరువులు వాడాలో సూచనలు చేయడంలో విఫలమవుతున్నారు. మొక్కలకు తెగుళ్లు సోకితే సమయానికి పలు సూచనలు చేసి మందులు, ఎరువులు వేస్తే మొక్క ఏపుగా పెరుగుతుంది. సకాలంలో అధికారులు తోటలను సందర్శించాలి. లేదంటే ఎరువులు, అధికారులు స్పందిచకపోతే రైతులకు నష్టమే తప్ప లాభం లేదు.

– మారెడ్డి ఏల్లారెడ్డి, రైతు, ఇర్కోడు, సిద్దిపేట రూరల్ మండలం

కొండపోచమ్మ హుండీ
ఆదాయం రూ.12,80,943

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. అమ్మవారి జాతర సందర్భంగా భక్తులు వివిధ కానుకల రూపంలో హుండీలో ముడుపులు చెల్లించుకున్నారు. అమ్మవారికి 76 రోజులకు గాను రూ. 12,80,943 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు దేవాలయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు. అమ్మవారికి కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజితరమేష్, డైరెక్టర్లు చెక్కల నరేశ్, కోట ఆశయ్య, ఆలయ సిబ్బంది మహేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, కనకయ్య, మాజీ చైర్మెన్ లక్ష్మి నరసింహరెడ్డి, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్దన్ ఉన్నారు.



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

రూ.కోటికి పైగానే..


- బీర్ల ధర పెంపుతో ఎక్సైజ్‌కు ఆదాయం
- ప్రస్తుతం నెలకు రూ. రెండు కోట్ల విక్రయాలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురవనుంది. ప్రభుత్వం బీర్ల ధరలను 15 శాతం పెంచడంతో నెలకు రూ. కోటికిపైగా ఆదాయం సమకూరనుంది. బీర్లకు ధరలు పెంచడంపై బీర్ల ప్రియులుఆందోళన వ్యక్తం చేస్తుండగా తమకు మాత్రం ఆదాయం పెరుగుతుందని ఎక్సైజ్‌శాఖ అంటోంది.

జిల్లాలో 93 వైన్ షాపులు, 16 బార్లు ఉన్నాయి. ఒక్కో వైన్స్‌లో రోజుకు 800 నుంచి 900 బీర్లు అమ్ముడుపోతాయి. అన్ని వైన్స్‌లలో, బార్లలో ప్రతి నెలలో సుమారు 1,50,000 కేసుల బీర్లు విక్రయిస్తారు. ఈ లెక్కన గత జనవరిలో బీర్ల అమ్మకాలపై రూ. 2 కోట్ల 53లక్షలు వచ్చాయి. పెరిగిన ధరల ప్రకారం సుమారు నెలలో రూ. 3 కోట్ల 60 వేల విలువైన బీర్లు అమ్ముడు పోతాయని అంచనా వేస్తున్నారు. అంటే సుమారు రూ. కోటికి పైగానే ఎక్సైజ్ శాఖకు ఆదాయం వస్తుందని తెలుస్తోంది. రానున్నది వేసవి కాలం.. అందులో బీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీంతో వేసవి కాలం మూడు నెలలు మరిన్ని బీర్లు అమ్ముడు పోతాయని భావిస్తున్నారు.

ఇప్పటికే స్టాక్..

జిల్లాలో వైన్స్, బార్ యజమానులు ఒకటి, రెండు రోజుల స్టాక్ ముందస్తుగానే ఆర్డర్ చేస్తారు. షాపుల్లోనూ ఒక రోజు కంటే ఎక్కువ స్టాక్ ఉంటుంది. ప్రభుత్వం బీర్ల ధర పెంచనుందనే ముందస్తు సమాచారంతో కొందరు ఎక్కువ మొత్తంలో ఆర్డర్ పెట్టి స్టాక్ నిల్వ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా బీర్ల ధరలు పెరగడంతో పాటు మంగళవారం నుంచే పెరిగిన ధరలు అమలులోకి రావడంతో యాజమానులకు లాభాల పంట పండనుంది. తక్కువ ధరకు కొనుగోలు చేసిన బీర్లను ఎక్కువ ధరకు అమ్ముకోనుండంతో వారి గల్లాపెట్టెలు గలగల లాడనున్నాయి.



వెనుకదారి నుంచి వేలాదిమంది!

- దొడ్డిదారిన పంపిస్తున్నదెవరు..మల్లన్నా!
- ప్రతీవారం భక్తుల అనుమతి

చేర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు ప్రతీ శని, ఆది, సోమవారం భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఆలయ ఆదాయ పరిరక్షణ దృష్ట్యా వెనుకదారి గుండా దర్శనానికి అనుమతించకుండా ఆలయ వర్గాలు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు రద్దీ వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ప్రొటోకాల్ ఉన్న వ్యక్తులను మినహా ఎవరినీ దర్శనానికి తీసుకెళ్లకూడదని సీపీ అనురాధ స్థానిక పోలీసులకు సూచించారు. వెనుకదారి మెట్ల గేట్‌కు తాళం వేయడంతో పాటు బయటికి వచ్చే క్యూలైన్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కానీ ప్రతీవారం వేలాదిమంది భక్తులు మాత్రం వెనకదారిగుండా దర్శనానికి వెళుతుండటం, సీపీ ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తుండటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య లెక్కించేందుకు కొన్నాళ్ల క్రితం వెనుకదారి మెట్లు చివరి భాగాన కౌంటింగ్ కెమెరా ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి బయటకు వస్తున్న వారితో పాటు వెనుకదారిన ఆలయానికి వెళ్లే వారి సంఖ్యను రికార్డు చేస్తుంది. సాధారణంగా నమోదైన సంఖ్యలో 2-5శాతం మేర వ్యత్యాసం ఉండనుండగా, మొదటి, రెండవ, మూడు, నాలుగు వారాల్లో వెనుకదారి గుండా వేలాది మంది లోపలికి వెళ్లినట్లు రికార్డైంది. వీవీఐపీ క్యూలైన్ ద్వారా కాకుండా జాతర బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా అనుమతిస్తుండటం కూడా ఆలయ బుకింగ్ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రొటోకాల్ వ్యక్తులను నేరుగా గేట్‌తీసి తీసుకువెళుతున్నా అనధికార వ్యక్తులు, తమ అనుయాయులను ఇష్టానుసారం పంపిస్తుండటం పట్ల ఆలయాధికారులు సైతం గుర్రుమీదున్నారు. ముఖమండపం గుండా దర్శనానికి తీసుకువెళ్లే విషయంలో ఇటీవల ఓ ఆలయ ద్వితీయ శ్రేణి అధికారి, పోలీసు అధికారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆలయ ఆదాయం తగ్గుముఖం పడుతుండటంతో వీవీఐపీ పాసుల జారీ మాదిరిగా ఎవరు ఎంతమందిని పంపిస్తారన్న విషయాన్ని రిజిస్టర్‌లో నమోదు చేస్తేనే అనుమతిస్తామని సూచించడంతో పోలీసు అధికారి నిర్లక్ష్యంగా మాట్లాడ టాన్ని ఆలయాధికారులు సీరియస్‌గా భావిస్తున్నారు. ఇన్నాళ్లూ పాలకమండలి సభ్యుల నడుమ తలెత్తిన వెనకదారి వివాదం ప్రస్తుతం ఆలయాధికారులు, పోలీసుల మధ్య కొనసాగుతుంది. నాలుగు వారాల్లో సుమారు 3 లక్షల మంది భక్తులు మల్లన్నను దర్శించుకోగా వెనకదారి గుండా 50 వేల మందికిపైగా శాస్త్ర విరుద్ధ దర్శనానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. జాతరలో ప్రధాన ఘట్టమైన మహాశివ రాత్రికి మరికొద్దిరోజుల గడువే ఉండటంతో పాటు మరిన్ని వారాలు జాతర కొనసాగనున్న క్రమంలో వెనకదారి దర్శనాల విషయంలో ఆలయవర్గాలు, పోలీసులు ఏవిధ ంగా వ్యవహరిస్తారు.. తద్వారా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది చూడాలి.



వెనుకదారి నుంచి దర్శనం కోసం రేణుకాచార్య మండప ఆవరణలో భక్తుల రద్దీ (ఫైల్)



జనవరి19న వెనుకదారి నుంచి 17వేలమంది ఆలయంలోకి వెళ్లినట్లు నమోదైన రికార్డు

కౌంటింగ్ కెమెరా సరిగా పనిచేయడం లేదు

- రామాంజనేయులు, ఈవో

వెనుకదారి గుండా వేలాదిమంది భక్తులు వెళ్తున్నార్న విషయాన్ని పరిగణించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. దర్శనం చేసుకుని బయటకు వచ్చే గేట్ ఆవరణలో బిగించిన హెడ్ కౌంటింగ్ మిషన్ సరిగా పనిచేయడం లేదు. అందుకు సంఖ్య తప్పుగా చూపుతుంది. పోలీసులకు కూడా పాసులు ఇస్తూ టికెట్ డబ్బులు తీసుకుంటున్నాం.

హెడ్ కౌంటింగ్ కెమెరా పనిచేస్తుంది

- ప్రవీణ్, టెక్నీషియన్

హెడ్‌కౌంటింగ్ కెమెరా బానే పని చేస్తుంది. భక్తులు మెట్లమీద నిలబడి సెల్ఫీలు దిగేందుకు కింది నుంచి పైకి వెళ్తుండడంతో రెట్టింపు తలలు లెక్కకువస్తున్నాయి. పరికరంలో చిన్నపాటిలోపం సవరిస్తే సంఖ్య సరిగ్గా తెలుస్తుంది.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- గజ్వేల్ వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ

గజ్వేల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు. గజ్వేల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గజ్వేల్ మండలవ్యవసాయాధికారి గుండు నాగరాజు, ఫాక్స్ సీఈవో బాలయ్యతో కలసి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఫాక్స్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని, రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. ప్రతి క్వింటాకు రూ.7,550 మద్దతు ధరను పొందాలన్నారు.

చిన్నకోడూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ సస్పెన్షన్

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లలో టెంపరరీ రిజిస్ట్రేషన్ సరిగ్గా నమోదు చేయకపోవడంతో చిన్నకోడూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ పరమేశ్వర్‌ను సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన జిల్లాలోని చేర్యాల, కోహెడ, కొండపాక, చిన్నకోడూరు మార్కెట్లలో సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. టీఎన్జీవోకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుతం మార్కెట్ సెక్రటరీ ఈ బాధ్యతలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజుకు అప్పగించారు.

ఏసీబీకి చిక్కిన దుబ్బాక ఆర్ఐ

- వారసత్వభూమి పేరు మార్పిడికి రూ. లక్ష డిమాండ్
- సిద్దిపేటలో పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు

దుబ్బాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ఆర్ఐ బుధవారం సాయంత్రం ఏసీబీకి పట్టుపడ్డారు. భూమి బదలాయింపు కోసం దుబ్బాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మన్నం నర్సింహారెడ్డి బుధవారం సాయంత్రం సిద్దిపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద ఓ టీపాయింట్‌లో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ కథనం ప్రకారం..

దుబ్బాక మండలం అప్పనపల్లికి చెందిన కుంభం రాజిరెడ్డికి సర్వే నెంబరు 257, 259, 266, 275, 287లో సుమారు మూడుఎకరాల 25గుంటల భూమి ఉంది. ఇటీవల ఆయన కన్ను మూయడంతో వారసత్వంగా భార్య సుజాత తన పేరిట భూమి బదలాయించాలని దుబ్బాక రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగింది. అధికారులు పట్టించుకోకపోవడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డిని ఆశ్రయించింది. దీంతో మొదట రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఏసీబీని ఆశ్రయించింది. లంచం ఇచ్చేందుకు సుజాత అంగీకరించడంతో నర్సింహారెడ్డి ఆమెను దుబ్బాకకు రావాల్సిందిగా సూచించాడు. అక్కడ రూ. 50 వేలు సరిపోవని, మరో రూ.50 వేలు కావాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష తీసుకుని సాయంత్రంలోగా సిద్దిపేటకు రావాలని చెప్పాడు. బుధవారం సాయంత్రం సిద్దిపేటలో టీపాయింట్ వద్ద బాధితురాలు రూ.లక్ష ఆర్ఐ నర్సింహారెడ్డికి అందించగానే ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన నుంచి రూ. లక్ష స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయనను దుబ్బాకలోని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి, కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు.



సిద్దిపేటలోని ఒక దుకాణంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన దుబ్బాక ఆర్ఐ నర్సింహారెడ్డి

బెల్టుషాపుపై పోలీసుల దాడి

● రూ. 55 వేల విలువైన బీరు, మద్యం బాటిళ్లు స్వాధీనం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఓ బెల్టుషాపుపై పోలీసులు దాడి చేసి బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన పంతం లక్ష్మీనారాయణ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే నమ్మదగిన సమాచారంతో బుధవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు బెల్టుషాపుపై దాడి చేశారు. రూ.55 వేల విలువ గల 206 లీటర్ల బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేపట్టిన గ్రామస్థులు



గామ ఐలయ్య(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు వివరాల ప్రకారం.. మండలంలోని వీరానగర్ గ్రామానికి చెందిన జాలి గామ ఐలయ్య ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిమెంటు బస్తాల కోసం ఐలయ్య బుధవారం అంకిరెడ్డిపల్లి వద్ద ఉన్న సిమెంటు దుకాణానికి వచ్చాడు. ఆటోను దుకాణం వద్ద నిలిపి రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఐలయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, వీరానగర్ గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని గజ్వేల్-చేగుంట రహదారిపై బైఠాయించారు. తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కంటైనర్ లారీ బైక్‌ను ఢీకొనడంతో మరొకరు..

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం తునికిమక్త గ్రామానికి చెందిన పసుల స్వామి(48) తన బైక్‌పై వర్గల్ కమాన్ చౌరస్తా నుంచి తూప్రాన్ రోడ్డు వైపు మలుపు తిరుగుతున్నాడు. ఇదే సమయంలో ప్రజ్ఞాపూర్ నుంచి తూప్రాన్ రోడ్డు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ బైక్‌పై వెళ్తున్న స్వామిని వెనుక నుంచి ఢీకొన్నది. స్వామి కిందపడిపోగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీడ్రైవర్ అక్కడి నుంచి పారిపోవడంతో 2 గంటల పాటు కంటైనర్ లారీ రోడ్డుపైనే నిలిచిపోయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి, కంటైనర్ లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొట్టిన లారీ

- ఎద్దు మృతి, మరో ఎద్దుకు విరిగిన కాలు
- ముగ్గురికి గాయాలు

కోహీర్, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండిని లారీ ఢీకొనడంతో ఒక ఎద్దు మృతిచెందగా, మరో ఎద్దు కాలు విరగడంతో పాటు బండిలో ఉన్న ముగ్గురికి గాయాలైన సంఘటన కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బ్యాగారి ఝుర్నప్ప అతని కుమారులు నరేష్, రాకేష్ మంగళవారం రాత్రి తమ వ్యవసాయ పొలం వద్ద చెరుకు పంటకు నీటిని అందించి బుధవారం తెల్లవారుజామున తమ ఎడ్లబడండిపై ఇంటికి బయలుదేరారు. బిలాల్‌పూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారి వెంబడి ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఎడ్లబండిని ఢీకొన్నది. దీంతో ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఎద్దు కాలు విరిగింది. ఎండ్లబండిలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. లారీని ఆపకుండా పారిపోయాడు. ఈ మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చెరువులో మునిగి బాలిక మృతి



జుబేరియా మృతదేహం

తూప్రాన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తల్లి చెరువులో దుస్తులను ఉతుకుతుండగా కూతురు పక్కనే ఆడుకుంటూ చెరువులో మునిగి మృతిచెందింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మహ్మద్ చాంద్‌పాష, పర్విన్ దంపతులకు ఇద్దరు పిల్లలు. బుధవారం పెద్దచెరువులో దుస్తులు ఉతికేందుకు పర్విన్ తన కూతురు మహ్మద్ జుబేరియా(6)తో వెళ్లింది. పెద్దచెరువులో బతుకమ్మఘాట్ వద్ద తల్లి దుస్తులను ఉతుకుతుండగా, బతుకమ్మ ఘాట్ మెట్లపై జుబేరియా ఆడుకుంటుంది. జుబేరియా చెరువులోని నీటిలోకి వెళ్లి మునిగిపోగా, తల్లి గమనించలేదు. కొంత సమయానికి పర్విన్ చూడగా జుబేరియా కనిపించకపోవడంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వెతకగా చెరువులో మునిగి కనిపించింది. వెంటనే వెలికితీసి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



లస్మయ్య (ఫైల్)

హవేళిఘణపూర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజిరేటకు చెందిన బత్తుల లస్మయ్య(60) చేపలు పడుతూ కొడుకుతో కలిసి జీవించేవాడు. ఇంట్లో వారు ఈనెల 10న హైదరాబాద్‌కు చిన్నకుమారుడి వద్దకు వెళ్లారు. లస్మయ్య ఒక్కడే ఇంటివద్ద ఉన్నాడు. మంగళవారం గ్రామ శివారులోని గంగమ్మ వాగుకు లస్మయ్య చేపలవేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి కుమారుడు భీమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.

కాళ్లకల్‌లో ఇల్లు దగ్ధం

- 3 తులాల బంగారం, రూ.35 వేలు అగ్నికి ఆహుతి



కాలిపోయిన నోట్లు

మనోహరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మనోహరాబాద్ మండల పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకాల్ గ్రామంలో 35 సంవత్సరాలుగా బిహార్ రాష్ట్రానికి చెందిన మితిలేష్ చౌహన్, లీలాదేవి దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో మంటలు చేలరేగి ఇల్లు దగ్ధమైంది. విషయం తెలియగా చౌహన్ ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న సుమారు 3 తులాల బంగారం, రూ.35 వేల నోట్లు, పిల్లల పుస్తాకాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. కాగా, దంపతుల ఇద్దరికి మంగళవారమే జీతాలు రాగా, ఆ డబ్బు మొత్తం ఇంట్లో పెట్టడంతో కాలిపోయింది.

మంటలు చెలరేగి ఆటో..



కాలిపోతున్న ఆటో

మనోహరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటోలో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన బుధవారం కాళ్లకల్ వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. తూప్రాన్ నుంచి మేడ్చేల్ వైపు వెళ్తుతున్న బోలేరో ఆటో వాహనం కాళ్లకల్ జనతా హోటల్ వద్దకు రాగానే మంటలు రావడంతో గమనించిన డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కనే నిలిపాడు. వెంటనే దిగడంతో డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. రోడ్డుపై ఆటో మంటల్లో కాలి దగ్ధమైంది.



తూప్రాన్ పట్టణ పరిధిలోని కుష్కిరాలు ప్రాంతం

కళతప్పిన 'కుష్కిరాలు'

- తూప్రాన్ శివారులోని ఊరైనా వసతులకు దూరం
- మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధుల శీతకన్ను
- సౌకర్యాలు లేక ఒక్కొకొక్కరుగా వీడిన ఊరు
- నాడు 20 కుటుంబాలు.. నేడు ఒకే కుటుంబం

తూప్రాన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అక్కడి ఇళ్లకు ఇంటి నంబర్లే లేవు.. ఇక సౌకర్యాల మాట దేవుడెరుగు.. ఒకప్పుడు 20 ఇళ్లతో కళకళలాడిన ప్రాంతం కాస్త ఎలాంటి వసతుల కల్పనకు నోచుకోక ఒక్కొక్కరుగా ఊరును వదలడంతో ఒకే ఒక కుటుంబం మిగిలింది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న పరిస్థితి అనుకుంటే పొరపడినట్లే.. తూప్రాన్ పట్టణ పరిధిలోని ఓ ఊరుకు పట్టిన గ్రహణమిది. అదే వందల ఏళ్ల క్రితం నుంచి ఉన్న ఊరు నిరాధరణకు గురై కాలగర్భం కలసిపోతున్న 'కుష్కిరాలు'.



కుష్కిరాలుకు వెళ్లేందుకు ఉన్న ఏకైన పానాధి దారి

తూప్రాన్ పట్టణానికి తూర్పు దిక్కున పురాతన రామాలయం సమీపంలో కుష్కిరాలు ఊరుంది. వందల ఏళ్ల క్రితం ముస్లిం కుటుంబాలు కొన్ని పొలాల వద్ద ఇళ్లను నిర్మించుకుని నివసించారు. 20 కుటుంబాలు వరకు ఉండేవి. పేరుకు కుష్కిరాలు ఊరే కానీ వసతుల పరంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. మేజర్ గ్రామ పంచాయతీగా తూప్రాన్ కొనసాగిన కాలంలోనే కుష్కిరాలలోని ఇళ్లకు ఇంటి నంబర్లు, దశబ్దాన్నర క్రితమే తాగునీటి వసతి కల్పించేందుకు వాటర్ ట్యాంకు నిర్మించారు. కానీ ఇతర సౌకర్యాలు ఏవీ సమకూర్చకపోవడంతో ఒక్కొక్క కుటుంబం కుష్కిరాలను వీడారు. తూప్రాన్ పట్టణంలోకి వచ్చి నివాసముంటున్నారు. ప్రస్తుతం కుష్కిరాలలో ఇళ్లు కూలిపోయి శిథిలావస్థకు చేరుకున్నారు. ప్రస్తుతం ఊర్లో సాధక్ అలీ కుటుంబం ఒక్కటే నివసిస్తుంది. తూప్రాన్ మేజర్ గ్రామ పంచాయతీ 2018లో మున్సిపాలిటీగా ఏర్పాటయ్యింది. నాటి నుంచి కుష్కిరాలపై పాలకులు శీతకన్ను వేశారు. మున్సిపాలిటీగా ఏర్పాటైనప్పటికీ ఎలాంటి వసతులు సమకూర్చకపోగా, ఉన్న ఇంటి నంబర్లను కూడా తొలగించారు. కుష్కిరాలకు ఉన్న పానాధి తోవను కనీసం మరమ్మతు కూడా చేసిన దాఖలాలు లేవు. ఇక్కడికి పొలాల గట్ల వెంట ప్రమాదకంగా వెళ్లాల్సి వస్తున్నది. ఊర్లో వీధి దీపాలు వేసేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, కనీసం వైర్లు ఏర్పాటు చేయలేదు. వాటర్ ట్యాంకు ఉన్న నీటిని సరఫరా



విద్యుత్ తీగలు, స్ట్రీట్ లైట్ లేని స్తంభం

చేసేందుకు మున్సిపల్ సిబ్బంది ఇటు వైపే చూడటంలేదు. అక్కడుండే సాధక్ అలీ కుటుంబమే వాటర్ ట్యాంకు నుంచి మిషన్ భగీరథ నీటిని వదలుకుంటారు. అడవిలో గిరిజన తెగలు ఉన్నట్లుగా పట్టణ పరిధిలో ఉంటున్న కుష్కిరాలు ప్రజలు నివసించడం విడ్డూరం. పట్టణంలో భారీగా విద్యుత్ కాంతులు వెదజల్లేందుకు డివైడర్‌పై విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేసి లైట్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. కానీ, కుష్కిరాలు ఊరుకు వెళ్లే మార్గంలో అక్కడక్కడ కూడా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయలేదు. రాత్రుల్లో కుష్కిరాలు వెళ్లాంటే భయంగా వెళ్లాల్సిందే. కుష్కిరాలు కు రోడ్డు సౌకర్యం, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు వసతులు కల్పించాలని కోరుతున్నారు.

వదలలేక ఎలాగోల బతుకుతున్నాం



నాకు 80 ఏళ్లకుపైగా ఉంటాయి. గ్రామపంచాయతీలో ఉన్నప్పుడు ఊరు కళకళలాడుతుండేది. ఇన్నేళ్లయిన కుష్కిరాలుకు రోడ్డు లేకుండా పోయింది. రాత్రుళ్ల చీకట్లో ఉంటున్నాం. చివరకు ఇంటి నంబరు కూడా లేకుండా చేశారు. ఎక్కడి పోబుద్ది కాక, ఊరును వదలలేక ఎట్టోగట్ట బతుకుతున్నాం.

- చోటిబీ, సాధక్ అలీ తల్లి

వసతులు కల్పించాలి



కుష్కిరాలు ఊరుగా ఉన్న కనీస వసతులు లేవు. స్ట్రీట్ లైట్లు, రోడ్డు ఏర్పాటు చేయాలి. కుష్కిరాలును ఊరుగా చూడాలి. కనీస వసతులు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపించాలి. మౌలిక వసతులు కల్పించాలి. అన్నీ వసతులు కల్పిస్తే ఇక్కడే అందరూ ఉండేవారు.

- సలీమా, సాధక్ అలీ భార్య

పుకార్లను నమ్మొద్దు

- గ్రామంలో శాంతి విరబూయాలి
- దుబ్బాక సీఐ శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్

దుబ్బాక, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, మోతె గ్రామంలో శాంతి విరబూయాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పుకార్ల మోతే' వార్తకు స్పందించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విద్యావంతులు, యువకులు ఎక్కువగా ఉన్నారని, అంతా కలిసి సమష్టిగా గ్రామాభివృద్ధికి నడుంబిగించాలని సూచించారు. మానవత్వపు కోవేలగా వెలిగిన మోతే వెలగొందలన్నారు. నల్లపోచమ్మ, వెంకటేశ్వరస్వామి, రామలింగేశ్వరుడు, దర్గా, ప్రార్థన మందిరాలన్నీ మానవత్వాన్నే ప్రబోధిస్తాయని తెలిపారు. అందరి విశ్వాసాలను గౌరవించాలని, మూఢవిశ్వాసాలను పారదోలలని కోరారు. గ్రామంలో కక్షలకు కార్పాణ్యాలకు తావివ్వద్దన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనం సామాజిక చైతన్యాన్ని స్ఫురిస్తుందన్నారు. పత్రికలు గ్రామాల్లో చైతన్య దీపికలన్నారు. గ్రామంలో ఎవరికి ఏ అపోహలున్నా తమను సంప్రదించాలని, నివృత్తి చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట భూంపల్లి- అక్బర్‌పేట ఎస్ఐ హరీష్ తదితరులున్నారు.

కొమురవెల్లిలో సత్రం నిర్మాణానికి సాయిల్ టెస్ట్

చేర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలో డోనర్ స్కీం ద్వారా 100 గదుల సత్రం భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలంలో బుధవారం జియాలజిస్టు, దేవాదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిధిలోని నిత్యాన్నదానసత్ర భవన సమీపంలో సాయిల్ టెస్ట్ నిర్వహించారు. స్థలం సామర్థ్యం పరీక్షల అనంతరం భవన ప్లాన్, మ్యాపులతో నివేదిక రూపొందిస్తామని, కమిషనర్ ఆమోదంతో పనులు చేపడతామని ఈవో రామాంజనేయులు తెలిపారు. ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

- ప్రేమ పెళ్లికి నిరాకరించిన మెదినీపూర్‌లో యువకుడు
- వడియారంలో పురుగుల మందు తాగి మరో యువకుడు..
- కడుపునొప్పి భరించలేక చల్మెడలో మహిళ బలవన్మరణం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయితో వివాహం చేయడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుకునూరుపల్లి మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెదినీపూర్ గ్రామానికి చెందిన గడ్డం గణేష్(22) తన ప్రేమ విషయాన్ని కొన్నాళ్ల క్రితం ఇంట్లో చెప్పాడు. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని తెలపగా కుటుంబసభ్యులు నిరాకరించారు. మేన మరదలుతో గణేష్ పెళ్లి చేయడానికి నిర్ణయించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ మంగళవారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లి అర్ధరాత్రి బయటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మద్యం తాగొద్దని మందలించడంతో..

చేగుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగొద్దని కొడుకును తండ్రి మందలించడంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం వడియారంలో బుధవారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గనబోయిన శివకుమార్ అలియాస్ శివుడు (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ చేయడంతో తండ్రి చంద్రయ్య కొడుకు శివకుమార్‌ను మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివకుమార్ మంగళవారం రాత్రి గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో పురుగుమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శివకుమార్‌ను నార్సింగ్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. శివకుమార్‌కు భార్య దీప, కొడుకు హర్షవర్ధన్, కూతురు రిత్విక ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉరేసుకుని మహిళ

నిజాంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండలం పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన సంగోళ్ల వినోద(32) రెండు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుంది. నొప్పిని భరించలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వినోద అత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పరారీలో ముగ్గురు అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12: మెదక్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సంజీవ్ ఆత్మహత్య కేసులో కీలక వీడియోతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో సంజీవ్‌ను వేధించిన ముగ్గురు అధికారులు పరారీలో ఉన్నట్లు సమాచారం. వారు యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీడియో ఆధారంగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఎస్ఐ మల్లిఖార్జున్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజశేఖర్‌ను పోలీసులు రెండు రోజుల క్రితం విచారించారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ విషయంలో కల్పించుకున్న పట్టణంలోని నేతలు సంజీవ్ కుటుంబానికి అండగా ఉంటామని, మృతుడి స్థానంలో అతని కుమారుడికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా అవకాశం కల్పించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అంతేగాకుండా వేధింపులకు గురి చేసిన అధికారుల నుంచి ఆర్థిక సహాయం అందేలా మాట్లాడినట్లు తెలిసింది. ముగ్గురు అధికారులను అరెస్ట్ చేయాలని సంజీవ్ కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ కేసులో సంజీవ్ ఆత్మహత్యకు ముందు సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసిన వీడియోసందేశం కీలకంగా మారింది. దీని ఆధారంగానే ముగ్గురు అధికారుల వేధింపుల విషయం వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో ఉన్న కీలకాంశాలు.. 'సార్ నేను చనిపోవడానికి కారణం ఒకటవది హెల్త్ అసిస్టెంట్ మహేష్.. రెండవది కుమ్మరి రాజశేఖర్.. మూడోది ఎస్ఐ.. ఈ ముగ్గురు నా చావుకు కారణమైతుండ్రు. నన్ను లంచం అడిగిర్రు.. ఇయ్యలేక పోయిన.. నన్ను ఇబ్బంది పెట్టి దంపింగ్‌యార్డులో వేసి చెత్త తీపించారు వీళ్లు.. నేను వీళ్ల కోసం చచ్చిపోతే దయచేసి నా ఉద్యోగం నా కొడుక్కు ఇవ్వగలరని కలెక్టర్‌కు నమస్కరించుకుంటున్నా' అని ఉంది.

మట్టి తరలింపు కేసులో ఇద్దరి బైండోవర్

మనోహరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలింపు కేసులో ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మనోహరాబాద్ మండల పరిధి కూచారానికి ఇద్దరు మట్టి దందా చేస్తున్నారు. ఆదివారం అక్రమంగా మట్టిని తరలిస్తుండుగా అదే గ్రామానికి చెందిన మజ్జతీ ఆనంద్ అడ్డుకున్నాడు. దీంతో ఇరు వర్గాల మధ్య గోడవ జరిగింది. ఆనంద్‌పై దాడి చేయగా అతడి చేయికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆనంద్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మేడ్చేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నాలుగు టిప్పర్లను పట్టుకోని పోలీస్ స్టేషన్ తరలించారు. మజ్జతి ఆనంద్ ఫిర్యాదు మేరకు అతడిపై దాడి చేసిన ఆంజనేయులు, గోవర్దన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. అలాగే, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట వారిని బైండోవర్ చేశారు.

కోహీర్‌లో ఓ ఇంట్లో చోరీ

- 10 తులాల వెండి, తులం బంగారం, పదివేల నగదును దోచుకెళ్లిన దుండగులు



బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

కోహీర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ పట్టణంలోని ఓ ఇంట్లో చోరి జరిగిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు.. కోహీర్‌కు చెందిన శంభునిసిద్ధన్న తన కుటుంబ సభ్యులతో కలిసి 10 రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం రాత్రి ఇంటికి తిరిగొచ్చారు. ఇంటిక వచ్చి చూసేసరికి ఇల్లు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న బట్టలు చిందరవందరగా పడేసి కనిపించాయి. బీరువాలో దాచిన పది తులాల వెండితో పాటు తులం బంగారం, రూ.10 వేలు దొంగతనం అయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కోహీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్యాచారయత్నం కేసులో దోషికి మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో దోషికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్స్ పోక్సో కోర్టు న్యాయాధికారి కె.జయంతి బుధవారం తీర్పు చెప్పారు. ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.... కోహీర్ మండలం మనియార్‌పల్లి గ్రామానికి చెందిన బాలిక(17)పై వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రానికి చెందిన బేగరి ఆంజనేయులు(19) 20211 జనవరి 1న అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో దోషి అయిన ఆంజనేయులుకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సూర్‌రెడ్డి వాధించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

రామచంద్రాపురం టౌన్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తమ్ముడిని హత్య చేసిన సంఘటనలో అన్నకు జీవిత ఖైదు విధించిన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాలు ప్రకారం.. అన్నదమ్ములు ఎండి లతీఫ్(24), ఎండి ఇబ్రహీం రామచంద్రాపురం బొంబేకాలనీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరి మధ్య కుటుంబ తగాదాలు ఉన్నాయి. 2020 జనవరి 17న ఎండి లతీఫ్‌ను అన్న ఇబ్రహీం రాత్రి నిద్రపోతున్న సమయంలో గొడ్డలితో నరికి హత్య చేశారు. మృతదేహాన్ని స్నేహితుడు ఎర్రోళ్ల అశోక్ సహకారంతో భారతీనగర్ డివిజన్ పరిధి మ్యాక్‌సొసైటీ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్‌కు వెళ్లే దారిలో నిర్మానుష్యమైన ప్రాంతంలో తగులబెట్టారు. గతంలో పని చేసిన సీఐ రమేష్, జగదీష్ విచారణ జరిపి ఇబ్రహీంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి భవానిచంద్ర ఇబ్రహీంకు జీవితఖైదు విధించి రూ.3వందలు జరిమానా వేస్తూ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా సహకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, కోర్టు కానిస్టేబుళ్లు కాశీనాద్, సుమన్, మహేందర్‌ను సీఐ అభినందించారు.



ఐడీఏబొల్లారం జగన్నాథస్వామి ఆలయం

ప్రతిష్ఠోత్సవానికి ఐడీఏ బొల్లారం

జగన్నాథ ఆలయం ముస్తాబు

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో అనుబంధంగా ఆరు రకాల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి 18 వ తేదీ వరకు రోజువారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీదేవి, వినాయకుడు, శివాలయం, దర్గాదేవి, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అమీన్‌పూర్ పెద్దచెరువులో అభిషేకించి అనంతరం అక్కడి నుంచి ఆలయం వరకు విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరుకానున్నారని ఆలయ కమిటీ తెలిపింది. ఒడిశా పూరీ జగన్నాధస్వామి ఆలయానికి చెందిన 19 మంది వేదపండితుల సమక్షంలో విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వినియోగంలోకి వచ్చేదెన్నడో?

హుస్నాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం వందమందికి పైగా పాఠకులు వచ్చే హుస్నాబాద్ నగర గ్రంథాలయానికి సొంతభవనం లేక ఇబ్బందులు ఇబ్బందులు తప్పడం లేదు.. నూతన భవన నిర్మాణం జరిగినా వసతులు లేమితో వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో కొన్నేళ్లు ప్రైవేట్ భవనంలోనే కొనసాగుతుంది. ఏడేళ్ల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణపనులు అనేక బాలారిష్టాలను దాటుకుని గత ఏడాది జూన్‌లో పూర్తయ్యాయి. అయితే కనీస వసతులను కల్పించక పోవడంతో నాటి నుంచి నిరుపయోగంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

రూ. 50 లక్షలతో నూతన భవన నిర్మాణం

పట్టణంలోని ఆఫీసు రోడ్డులో దాదాపు నాలుగు దశాబ్దాల పైగా కొనసాగిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 14.8.2017న నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే వివిధ కారణాలతో




నిరుపయోగంగా ఉన్న నూతన భవనం, రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

పనులు ప్రారంభం కాలేదు.. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి గత ఏడాది జూన్‌లో నిర్మాణ పనులు పూర్తి చేశారు. నూతన భవనానికి శంకుస్థాపన చేసినప్పటి నుంచి తాత్కాలికంగా రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే సొంత భవనం లేక పోవడంతో సౌకర్యాలు సరిగా లేక పాఠకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అవసరమైన సౌకర్యాలు ఇవీ..

నూతన భవనంలో కనీస వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ప్రధానంగా మంచి నీటి కోసం బోరు వేయాల్సి ఉంది. బాత్‌రూమ్‌లు, ప్రహరీ, గేట్ ఏర్పాటు చేయాలి. ఇవే కాకుండా పాఠకులకు అనువైన ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే వినియోగంలోకి వస్తుంది. వీటికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి త్వరగా వినియోగంలోకి తేవాలని పాఠకులు, నిరుద్యోగులు కోరుతున్నారు.

- ఏడేళ్ల క్రితమే శంకుస్థాపన
- రూ.50 లక్షల వ్యయం
  గత ఏడాది పూర్తయిన పనులు
- సౌకర్యాలు లేక వినియోగానికి దూరం
- రెండేళ్లుగా రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో కొనసాగుతున్నవైనం
- ఇదీ.. హుస్నాబాద్ గ్రంథాలయం కథ

సొంత భవనాన్ని వినియోగంలోకి తేవాలి



చిగురుమామిడి మండలం రేకొండ నుంచి ఇక్కడికి వచ్చి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా. ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో గ్రంథాలయం కొనసాగుతుండటంతో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సొంత భవనం ఉన్నప్పటికీ అందులో సౌకర్యాలు కల్పించక పోవడంతో వినియోగంలోకి రావడం లేదు. పాలకులు స్పందించి త్వరగా అందులో సౌకర్యాలు కల్పించాలి.

- బోయిని దీప్తి, రేకొండ, చిగురుమామిడి మండలం

కనీస సౌకర్యాలు కల్పించాలి



నియోజకవర్గ కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాఠకులతో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే మా వంటి వారంతా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేట్ భవనంలో పుస్తకాలు ఇతర సౌకర్యాలు ఉన్నప్పటికీ సొంతభవనం లేక కొంత ఇబ్బందికరంగా మారింది. నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

- బి సంతోష్‌కుమార్, గౌరవెల్లి

రూ.30లక్షలతో వసతులు కల్పిస్తున్నాం



గ్రంథాలయ నూతన భవనాన్ని రూ. 50 లక్షల వ్యయంతో విశాలంగా నిర్మించాం. ప్రస్తుతం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మరో రూ. 30 లక్షలు మంజూరు చేయించారు. అవసరమైన సౌకర్యాల గురించి అధికారులకు నివేదిక పంపించాం. మరో 15 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయి. ఈ నిధులతో ప్రహరీ, బాత్‌రూమ్‌లు, ఫర్నిచర్ తదితర వసతులు కల్పించి త్వరలో వినియోగంలోకి తీసుకవస్తాం.

- కేడం లింగమూర్తి, జిల్లా గ్రంథాలయ చైర్మన్

బెక్కల్‌లో బ్రహ్మోత్సవాలు షురూ

ధూళిమిట్ట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెక్కల్ గ్రామంలో రామాచల గుట్టపై కొలువై ఉన్న ప్రముఖ శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.స్వామివారి మేలు కొలుపు, ఏకాదశ రుద్రాభిషేకం, బండ్లసేవ, పల్లకీసేవ, కళాకారులతో నాటక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. మాఘమాస పౌర్ణమితో మొదలు శివరాత్రి వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలి

చేర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భాషాపండితులకు పూర్తిస్థాయిలో పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కడవేరుగు జడ్పీఎస్‌ఎస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కొంతమంది పదోన్నతులకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి పదోన్నతులతో న్యాయం చేకూర్చాలని కోరారు. ఆయనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నుకున్నారు.

కొమ్మూరికి బీరప్ప కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక

చేర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో ఈ నెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు కురుమసంఘం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన బీరప్ప-కామరాతి కళ్యాణ వేడుకలకు హాజరుకావాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరిప్రతాప్‌రెడ్డికి ఆ సంఘం నాయకులు బుధవారం మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానపత్రిక అందజేశారు.

జాలపల్లివాసికి అత్యుత్తమ అవార్డు

ధూళిమిట్ట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన గంగరబోయిన బాలయ్య 20ఏళ్లుగా విద్యా రంగంలో విశేషమైన కృషి చేసినందుకుగాను అత్యుత్తమ పురస్కారం లభించింది. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ నుంచి 2025 సంవత్సరానికి స్వామి వివేకానంద జాతీయ అత్యుత్తమ ప్రిన్సిపాల్ అవార్డు పురస్కారాన్ని పూణేలో ఈ నెల 8న జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఆయన ప్రస్తుతం మహారాష్ట్రలోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తమ గ్రామవాసికి అవార్డు రావడం పట్ల జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్, గ్రామస్థులు అభినందించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

చేర్యాల/దుబ్బాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం గురువన్నపేట జడ్పీఎస్‌ఎస్, దుబ్బాకలో ప్రాథమిక పాఠశాల(1)లో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గజ్వేల్‌లోని ఏఎంసీ కార్యాలయంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్యదర్శి జాన్‌వెస్లీ

గజ్వేల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గజ్వేల్ మండలం వ్యవసాయాధికారి గుండు నాగరాజు, పాక్స్ సీఈవో బాలయ్యతో కలసి ఆయన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పాక్స్ ద్వారా కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని, రైతులు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతీ క్వింటాలుకు రూ.7,550 మద్దతు ధరను పొందాలని సూచించారు.

ఆరు క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో కందులను ఆరు క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని రైతు ఐక్య సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం మూడు క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తుండటంతో కంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బయట తక్కువ ధరకు విక్రయించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిని ప్రభుత్వం సవరించి ఆరు క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోటీ పరీక్షల మెళకువలపై వర్క్‌షాప్



జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థినులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. గణితశాస్త్ర అధ్యాపకురాలు ఎన్ వీణ నేతృత్వంలో పోటీ పరీక్షల్లో గణితానికి సంబంధించిన మెళకువల పట్ల గణిత నిపుణుడు ఏ.స్వామి ఈ కార్యశాలలో అవగాహన కల్పించారు. అర్థిమెటిక్, రీజనింగ్ అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పోటీ పరీక్షల్లో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్యామ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.స్రవంతి, జంతు శాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్ శ్వేత, రాజనీతి శాస్త్ర సహాయచార్యులు డాక్టర్ సామ సువర్ణ దేవి, చరిత్ర ఉపన్యాసకుడు సంతోష్‌కుమార్, గణాంక శాస్త్ర విభాగాధిపతి ప్రసాద్ తెలిపారు. కాగా సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. ఆంగ్ల విభాగం, తెలుగు విభాగం, గణాంక శాస్త్ర విభాగం కంప్యూటర్ సైన్స్ విభాగానికి సంబంధించిన విద్యార్థినులు క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయం, డిజిటల్ లైబ్రరీ, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను విద్యార్థినులు సందర్శించారు. పలు అంశాలను పరిశీలించారు.

మహిళల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం: హరికృష్ణ



పట్టణ అధ్యక్షురాలిగా పద్మకు నియామకపత్రాన్ని అందజేస్తున్న పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో మహిళా విభాగం సిద్దిపేట పట్టణ అధ్యక్షురాలిగా మార్క పద్మను నియామకం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, జిల్లా మహిళావిభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ తదితరులు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే మహిళలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు పెద్ద ఎత్తున అవకాశం కల్పిస్తామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవలే వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంసభ్యులను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ బుధవారం పరామర్శించారు. సిద్దిపేట రూరల్ మండలం బస్వాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి నానమ్మ ఆలూరి మణెమ్మ మృతి చెందగా నివాళులర్పించి, వారి కుటుంబాన్ని ఓదార్చారు. అదేవిధంగా ఇరుకోడు కాంగ్రెస్ నాయకుడు గణపురం ప్రవీణ్ తాత గణపురం నర్సయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణరావుపేటలో కాంగ్రెస్ నాయకుడు బందారం రమేష్‌గౌడ్ సోదరుడు బందారం నవీన్‌గౌడ్ గుండెపోటుతో మరణించగా, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరికృష్ణ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

జోరుగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారాలు

గజ్వేల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిత్యం సేవ చేసే అంజిరెడ్డిని గెలిపించాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి సతీమణి గోదావరి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని బార్ అసోసియేషన్, ఆర్మీ అకాడమీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ప్రజా సేవ లో ఉంటూ ఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆమె వెంట బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

హుస్నాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల గొంతుకను చట్ట సభల్లో వినిపిస్తానన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో కష్టం ఎక్కువ, పారితోషికం తక్కువ అని గుర్తు చేశారు. తన విద్యాలయాల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని తెలిపారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించానన్నారు.

ఆకతాయిలకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 3 నెలల కాలంలో అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తూ షీ టీమ్స్‌కు పట్టుబడిన 52 మంది ఆకతాయిలను ఆయా పోలీసు స్టేషన్‌లకు పిలిపించి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ మహిళా పోలీస్‌స్టేషన్ సిద్దిపేట, గజ్వేల్ హుస్నాబాద్ పోలీస్ స్టేషన్లలో మహిళా భద్రతా విభాగం(ఉమెన్ సేఫ్టీ వింగ్) హైదరాబాద్‌కు చెందిన నిపుణులచే నిర్వహించిన జూమ్ మీటింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలను ఎలా గౌరవించాలి, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లయితే చట్ట ప్రకారం ఎలాంటి శిక్షలకు గురవుతారు, సమాజంలో బాధ్యత గల పౌరునిగా ఎలా జీవించాలి తదితర విషయాలపై కౌన్సెలింగ్‌లో వారికి అవగాహన కల్పించారు. మహిళలు, యువతులను ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, గజ్వేల్ షీటీమ్ ఇంచార్జ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిద్దిపేట షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ కిషన్, హుస్నాబాద్ షీటీమ్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మూడు డివిజన్లో షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 48 మంది ఎంపిక

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించగా విశేష స్పందన వచ్చింది. 176మంది పాల్గొనగా వివిధ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో 48 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ రెడ్డి తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 18 మంది అభ్యర్థులు, యాక్సిస్ బ్యాంక్‌లో 25 మంది అభ్యర్థులు, యునిమొనిలో ఐదుగురు అభ్యర్థులు ఎంపికైనట్లు టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉమామహేశ్వరి తెలియజేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శన్, ఐపీఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్, టీఎస్‌కేసీమెంటార్ ఎస్ మహేష్ వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేతో పని ఒత్తిడి: ఏఈవోలు



డీఏవో రాధికకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ సర్వేతో పని ఒత్తిడికి గురవుతున్నామని, సర్వేలో రైతులు, ఇతర సంబంధిత అధికారులను సహకరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఈవోలు తెలిపారు. ఈ మేరకు బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో డిజిటల్ క్రాప్ సర్వేతో అగ్రికల్చర్ విస్తరణ అధికారులు(ఏఈవో) క్షేత్రస్థాయి ఎదురయ్యే సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఏవో రాధికకు అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారు డీఏవోను కోరారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య సూచించారు. బుధవారం గజ్వేల్‌లోని ఆయా వ్యాపార, వాణిజ్య సముదాయాలను పరిశీలించిన కమిషనర్ మొండి బకాయిలను చెల్లించాలని సూచిస్తూ, పలువురి వద్ద ఆస్తి పన్నులను వసూలు చేశారు. అంతేకాకుండా వ్యాపార సముదాయాలను పరిశీలించడంతో పాటు వాటికి కొలతలు వేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు విధించారు. వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు.

కోతుల బెడద తొలగేనా?



కోతులను భయపెట్టే పరికరం పనితీరును చూపుతున్న విక్రయదారుడు

కొండపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కోతులబెడదను వదిలించుకునేందుకు ప్రజలు, రైతుల పాట్లు వర్ణనాతీతం. గుంపులుగా వస్తున్న వాటిని పారదోలడం కోసం పడే తిప్పలు అంతా ఇంతా కాదు. ఇందులో భాగంగానే కోతులను భయపెట్టేందుకు మార్కెట్లోకి వస్తున్న ప్రతీ వస్తువును కొనుగోలు చేస్తున్నారు ఎల్ఈడీ లైటు, గులెహర్, పొడవాటి కట్టెలతో పాటు పంటల చుట్టూ సోలార్ తీగలతో ఫెన్సింగ్ చేస్తున్నారు. వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ప్లాస్టిక్ గొట్టంతో లైటర్ ఉపయోగించి చేసిన సాధనాన్ని విక్రయిస్తుండటం ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. టపాకాయలలో వాడే మందు గుళికలను అందులో వేసి బటన్ నొక్కితే సౌండ్ వస్తుంది. ఈ శబ్ధానికి కోతులు పారిపోతాయని దానిని తయారు చేసినవారు చెబుతున్నారు. వాటిని కొంతమంది ఆసక్తిగా పరిశీలించి కోతుల బెడదను తొలగించుట కోసం కొనుగోలు చేశారు. కనీసం దీంతోనైనా తమకు కోతుల బెడద నుంచి విముక్తి కలుగుతుందేమోనని ఆశిస్తున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి



లక్ష్మినర్సయ్య(ఫైల్)

వర్గల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. బుధవారం గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మినాజీపేట గ్రామానికి చెందిన దుందిగల్ల లక్ష్మినర్సయ్య(61) తన ఇంటి పక్కనే ఉన్న బావి వద్ద పైపునకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడటంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

తిగుల్‌లో బోరు పంపుల కేబుల్ చోరీ

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల వద్ద ఉన్న బోర్‌పంపుల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మండలంలోని తిగుల్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్థులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి పలువురు రైతులు బుధవారం ఉదయం ఎప్పటిలాగే తమ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి చూడగా 12 మంది రైతులకు చెందిన బోర్‌పంపుల కేబుల్‌వైర్లు చోరీకి గురైనట్టు గుర్తించారు. దాదాపు రూ. లక్ష వరకు నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. కాగా ఇటీవలే 4 రోజుల క్రితం కొందరు రైతులకు చెందిన సర్వీస్ కేబుళ్లను గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడగా పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ ఘటన జరిగిన నాలుగురోజులైనా గడవకముందే మరోసారి చోరీ జరగడం చర్చనీయాంశంగా మారింది. వరుస కేబుల్‌వైర్ల చోరీతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు



నిందితులను పట్టుకున్న చేర్యాల ఎక్సైజ్ శాఖాధికారులు

మద్దూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. బుధవారం చేర్యాల ఎక్సైజ్ శాఖ ఎస్ఐలు పి.సురేష్, జి. సువర్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాగిళ్లాపూర్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కొమురవెల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో అక్రమంగా నాటు సారాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 7.8 లీటర్ల నాటు సారాయితో పాటు కారు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. అలాగే వారికి సారా తయారు చేసి విక్రయిస్తున్న దూళిమిట్ట మండలం చర్లతండాకు చెందిన వ్యక్తిని పట్టుకునేందుకు వెళ్లగా పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా.. ఇద్దరికి జైలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సిద్ధిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. బుధవారం సిద్దిపేట సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం వారికి రూ.8000 జరిమానా విధించారు. వారిలో ఇద్దరికి జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధించారు.

పంచాయతీ సిబ్బందిపై దాడి ఘటనపై విచారణ

కొండపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సిబ్బందిపై దాడి జరిగిన సంఘటనపై పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న గజ్జె నర్సింహులు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునపై అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం గ్రామపంచాయతీ ముందు ఉన్న ఫ్లెక్సీలను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో బీజేపీ నాయకుడికి సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించడంతో అదే గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు చెన్న హరికిషన్, శ్రీరామ్, మధు అక్కడికి చేరుకొని తీవ్ర దుర్భాషలాడుతూ పంచాయతీ సిబ్బంది కిష్టయ్యపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కొండపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. బాధితుడిని, సాక్షులను విచారించి వివరాలు సేకరించారు.

కేసీఆర్ జన్మదిన వేడుకల సన్నాహక సమావేశం

మర్కుక్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న మాజీ సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని కేసీఆర్ దత్తత గ్రామమైన ఎర్రవల్లిలో ఘనంగా నిర్వహించనున్నట్టు మాజీ సర్పంచ్, పాక్స్ వైస్ చైర్మన్ కమ్మరి భాగ్యబాలరాజు, ఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ మేరకు ఈ నెల 17న ఎర్రవల్లి గ్రామ పోచమ్మ ఆలయం వద్ద సుదర్శన యాగం, ఆయుష్య హోమం నిర్వహిస్తున్నామని ఊరంతా పండగగా సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, నాయకులు వెంకటరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన



మద్దూరులో మహిళా సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం

మద్దూరు/ములుగు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్యానికై ఆహారం పోషణ ఆరోగ్యంతో పాటు పారిశుధ్యంపై మూడు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నట్లు డీపీఎం రాజయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు మహిళా ఆరోగ్యంపై గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులకు, సీఏలకు, గ్రామ సంఘం కమిటీ సభ్యులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక బలోపేతానికి వివిధ రకాల రుణాలు అందిస్తూ ఆర్థిక బలం చేకూరుస్తుండటంతో పాటు వారి కుటుంబాల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపేందుకు నెలవారి సమావేశాలతో పాటు అదనంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మూడు బ్యాచ్‌లు ఏర్పాటు చేసిన రోజుకో 12 సంఘాలకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ములుగు మండలకేంద్రంలోని మహిళా సమైఖ్య భవనంలో మహిళా సంఘ వీవోలకు బుధవారం ఆరోగ్య సబ్ కమిటీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం యాదగిరి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తినే ఆహారంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉగాది బాలల కథల పోటీకి 372 కథలు

కొండపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉగాది బాలల కథల పోటీకి జిల్లా వ్యాప్తంగా 372 కథలు అందాయని సుగుణ సాహితీసమితి కన్వీనర్ బైతి దుర్గయ్య తెలిపారు. ఏటా సుగుణ సాహితీ సమితి ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా విద్యార్థులకు కథల పోటీలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈసారి కూడా కథల పోటీలకు మంచి స్పందన వచ్చిందన్నారు. మార్చి నెలాఖరులో ఫలితాలు ప్రకటించి,బహుమతులు అందిస్తామని తెలిపారు.

చేర్యాలకు తపాస్‌పల్లి నీరు అందించాలి : జేఏసీ చైర్మన్

చేర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల ప్రాంత రైతాంగం కోసం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలతో చెరువులు, కుంటలను వెంటనే నింపాలని రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్‌రామగల్ల పరమేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి పొలాలను ఎండబెట్టి ఇతరప్రాంతాలకు నీటిని తరలిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. భూగర్భజలాలు అడుగంటి నీరందక పొలాలు ఎండిపోతున్నాయని, రిజర్వాయర్‌లోకి పంపింగ్ కొనసాగుతున్నందున వెంటనే చేర్యాల ప్రాంత చెరువులు నింపి రైతులకు సాగునీరందించాలని కోరారు.